పుణ్య కార్యం.. అన్నదానం

- రైల్వే న్యూకాలనీ ధ్యాన మందిరంలో 13 ఏళ్లుగా నిర్వహణ
- ఉగాది పర్వదినాన 14వ వసంతంలోకి..
- అటు ఆధ్యాత్మిక.. ఇటు సేవా కార్యక్రమాలతో ఆదర్శం


రైల్వే న్యూకాలనీ ధ్యాన మందిరంలో అన్నదాన కార్యక్రమం


షిర్డీసాయిబాబా ధ్యాన మందిరం

తాటిచెట్లపాలెం: 'అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న. గొప్ప పుణ్య కార్యం' అని అంటారు. 13 ఏళ్లుగా నిర్విఘ్నంగా ఈ విశేష సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరం. అటు ఆధ్యాత్మికం గాను.. ఇటు సేవా పరం గాను ఈ మందిరం దినదినాభివృద్ధి చెందుతూ విరాజిల్లుతోంది. భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. 2010 మార్చి 16వ తేదీ ఉగాది పర్వదినాన ధ్యాన మందిరంలో భక్తులు, పేదల కోసం అన్నసమారాధన ప్రారంభించారు. మొదట్లో కేవలం గురువారాల్లో మాత్రమే అన్నదానం చేసేవారు. నాడు కేవలం 10 మందితో ప్రారంభమై నేడు నిత్యాన్నదానంగా మారి ప్రతి రోజూ దాదాపు 100 మందికి, గురువారాల్లో సుమారు 200 మందికి అన్నదానం చేస్తున్న స్థాయికి ఎదిగింది. ఏ సమయంలోనైనా అన్నార్తుల ఆకలి తీర్చేందుకు ఇంటర్నేషనల్ వైశ్ ఫెడరేషన్ సహకారంతో 24 గంటలూ తాజా ఆహారాన్ని అందించేందుకు రెండు కమ్యూనిటీ ఫ్రిజ్‌లను ఇక్కడ ప్రారంభించారు. దీంతో కొంత ఆహారాన్ని ప్యాకెట్ల రూపంలో భద్రపరచి ఈ ఫ్రిజ్‌ల్లో ఉంచడం వల్ల అవసరమున్న వారు ఏ సమయంలోనైనా వీటిలో నుంచి తీసుకుని వారి ఆకలి తీర్చుకుంటున్నారు. ఇలా ఎన్నో విశిష్టతలు కలిగిన ఈ ధ్యాన మందిరంలో ప్రత్యేక పర్వదినాల్లో పూజా కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఉగాది, శ్రీరామనవమి పర్వదినాల్లో ప్రత్యేక పూజలు

ఈ నెల 22వ తేదీ ఉగాది రోజున 14వ వసంతంలోకి షిర్డీసాయిబాబా ధ్యాన మందిరం అడుగుపెట్టనుంది. ఈ సందర్భంగా ఉగాది, శ్రీరామనవమి పండగలను పురస్కరించుకుని ధ్యాన మందిరంలో ఈ నెల 22 నుంచి 30 వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉగాది రోజున బుధవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భక్తుల స్వహస్తాలతో సాయిబాబాకు క్షీరాభిషేకం, నవగ్రహారాధన, నవగ్రహ హోమం, సాయంత్రం 5 గంటలకు సహస్ర నామార్చన, రాత్రి 7 గంటల నుంచి పంచాంగ శ్రవణం, రాత్రి 8 గంటలకు సాయిబాబా గీతాలాపన(భజన) కార్యక్రమాలు జరుగుతాయి. ఈ నెల 30వ తేదీ శ్రీరామ నవమి రోజున ఉదయం స్వామికి సుగంధ ద్రవ్యాభిషేకం, పుష్పార్చన, సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహిస్తారు.


24 గంటలు ఆహారం అందుబాటులో ఉంచే కమ్యూనిటీ ఫ్రిజ్‌లు

భక్తులు, దాతల సహకారం



సాయిబాబా దయతో, భక్తులు, దాతల సహకారంతో 13 ఏళ్ల నుంచి నిర్విఘ్నంగా అన్నదానం కొనసాగిస్తున్నాం. కరోనా సమయంలో కూడా ప్యాకెట్ల రూపంలో ఆహారం అందజేశాం. మాలధారులకు ఈ ఏడాది 60 రోజుల పాటు ప్రత్యేక అన్నదానం నిర్వహించాం. కమ్యూనిటీ ఫ్రిజ్ ద్వారా ఏ సమయంలోనైనా పేదలు, అన్నార్తుల ఆకలిని తీర్చగలుగుతున్నాం.

–నూకల శేషగిరిరావు,
ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు

క్లుప్తంగా

'స్పందన'కు 16 అర్జీలు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 16 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ పేర్లి శ్యామ్‌ప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. వినతుల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకుంటామన్నారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి పండ్లకు గిరాకీ


సీతమ్మధార రైతుబజార్‌లో పరియాలు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో మామిడి పండ్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. సాధారణంగా ఉగాది మొదటి వారం నుంచి మామిడి పండ్ల(పరియాలు రకం) విక్రయాల మొదలు పెడతారు. తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకుని ఆలయంలో, ఇంట్లోని దేవుడి సన్నిధిలో మామిడి పండ్లు ఉంచుతారు. దీంతో పరియాలు రకం పండ్లకు గిరాకీ పెరిగింది. రైతుబజార్‌లో కిలో రూ.90 చొప్పున విక్రయిస్తున్నారు.

సచివాలయంలో జీవీఎంసీ పీడీ తనిఖీలు


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ పాపినాయుడు

సీతంపేట: జీవీఎంసీ జోన్–5 పరిధిలోని శ్రీనివాసనగర్–1 వార్డు సచివాలయంలో సోమవారం జీవీఎంసీ పీడీ పాపినాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది పనితీరు, సంబంధిత రికార్డులను పరిశీలించారు. అక్కడకు వచ్చిన వారితో మాట్లాడి సిబ్బంది సేవలపై ఆరా తీశారు. ప్రజలకు అన్ని రకాల సేవల అందుబాటులో ఉండాలని, ప్రతి రోజూ స్పందన నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. సచివాలయ సిబ్బందికి పీడీ పలు సూచనలిచ్చి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ఏపీడీ పద్మావతి పాల్గొన్నారు.

కాళీ కాలభైరవులకు రుద్రాభిషేకం


కాళీ కాలభైరవులకు రుద్రాభిషేకం చేస్తున్న అర్చకులు

సీతంపేట: మాస శివరాత్రి సందర్భంగా సోమవారం లలితానగర్ లలితా పీఠంలో కొలువైన కాళీకాలభైరవులకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. పీఠం అర్చకుల వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా అభిషేకం జరిపించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. అమావాస్య సందర్భంగా మంగళవారం ఉదయం 10 గంటలకు శ్రీప్రత్యంగిరా భద్రకాళి హోమం జరుగుతుందని ఆయన తెలిపారు. పాల్గొన దలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఘనంగా నూకాలమ్మ పండగ

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డు బర్మా క్యాంప్, బర్మా కాలనీ, సత్యానగర్ ప్రాంతాల గ్రామ దేవత నూకాలమ్మ తల్లి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 13న ప్రారంభమైన వేడుకల్లో భాగంగా సోమవారం కాలనీల్లో అమ్మవారి ఘటాలను ఊరేగించారు. భక్తులు ఆలయాలను దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం సాయంత్రం మాలధారుల అగ్నిగుండం తొక్కుతారు. మంగళవారం అమ్మవారి ఊరేగింపుతో ఉత్సవాలు ముగుస్తాయి. బర్మా క్యాంపు నూకాంబిక ఆలయంలో జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈవో నగేష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అటవీ సంరక్షణపై చిత్రలేఖన పోటీలు


పెయింటింగ్స్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులతో హెచ్‌ఎం శ్రీనివాసరావు

కంచరపాలెం: వరల్డ్ ఫారెస్ట్ డేను పురస్కరించుకుని డీఈవో ఎల్.చంద్రకళ ఆదేశాల మేరకు సోమవారం ఆర్పీ పేట జీవీఎంసీ హైస్కూల్‌లో అటవీ సంరక్షణపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు పర్యవేక్షణలో సుమారు 80 మంది విద్యార్థులు వివిధ రంగులతో అటవీ సంరక్షణ చిత్రాలు పెయింటింగ్ చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో హైస్కూల్ డ్రాయింగ్ అండ్ క్రాఫ్ట్ ఉపాధ్యాయులు నమ్మి జె.వి.సాయిశంకర్, సూరిశెట్టి రేణుకాదేవి, సీఆర్పీ లంక చైతన్య తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాకర్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు


మాట్లాడుతున్న పల్లా చంద్రమౌళి

మురళీనగర్: వాకర్స్ క్లబ్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని క్లబ్ సభ్యులు తీర్మానించారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో సోమవారం క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఈమేరకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. నెలవారీ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. నెలవారీ సమావేశాలను మొదటి శనివారం, కార్యవర్గ సమావేశాన్ని ప్రతి మూడో శనివారం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా క్లబ్ నిర్వహించిన పలు కార్యక్రమాలపై సమీక్షించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ జనరల్ ఆర్.సత్యనాథం, పూర్వ అధ్యక్షులు ఎన్.బుచ్చయ్య, కె.ద్వారకానాథ్, కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజాహితుడు సీఎస్ రావు


సీఎస్ రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్, సాహితీవేత్తలు

సీతంపేట: నిస్వార్థంగా సమాజ సేవకు అంకితమయ్యే అరుదైన వ్యక్తుల్లో సీఎస్ రావు అగ్రగణ్యుడని గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్ దాస్ అన్నారు. ఇటీవల కన్నుమూసిన ప్రజాహృదయ నేత, ప్రజాస్పందన వ్యవస్థాపకుడు సి.ఎస్.రావు సంస్మరణ సభ గాంధీ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ విలువలు, సచ్ఛీలత, నిజాయితీ, సమయపాలన, విజ్ఞానం, వినమ్రత అన్నీ కలబోసిన వ్యక్తి సి.ఎస్.రావు అని కొనియాడారు. ఆయన లోని లోటు పూడ్చలేనిదని పేర్కొన్నారు. మనందరం ఆయన ఆశయ సిద్ధికి కృషి చేయాలని కోరారు. సహృదయ సాహితి సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజాహితం కోసం సి.ఎస్.రావు ఎన్నో ఉద్యమాలు చేశారన్నారు. పదవీ విరమణ అనంతరం విశాఖ వచ్చి సమాజ సేవ చేయడం మనందరి అదృష్టమన్నారు. సాహితీవేత్త డి.వి.సూర్యారావు మాట్లాడుతూ సి.ఎస్.రావు నుంచి క్రమశిక్షణ, కార్యదీక్ష, సామాజిక స్పృహ, కర్తవ్యపాలన నేటితరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నండూరి రామకృష్ణ, కె.వి.ఎస్.మూర్తి, డాక్టర్ జి.రఘురామారావు, ఎస్.విజయ్‌కుమార్, కూటికుప్పల సూర్యారావు, వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి, సి.ఎస్.రావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కుమ్మేసిన వాన


అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో కురుస్తున్న వర్షం

సీతంపేట: వేసవి ఆరంభంలో అనుకోని అతిథిలా వర్షం పలకరించింది. తుపాను ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వానలతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. వర్షాకాలం అనంతరం చాన్నాళ్లకు వాన పలకరించిందని నగరవాసులు మురిసిపోయారు. సోమవారం పగలంతా ఎండ కాసినా.. సాయంత్రం ఒక్కసారిగా మబ్బులు కమ్ముకుని ఆకాశం మేఘావృతమై జోరుగా వాన కురిసింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లగా మారింది. రాత్రి వరకు ఒకే రీతిలో కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. వ్యాపారాలు సాగక సీతంపేట మెయిన్ రోడ్, శంకరమఠం రోడ్, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ ప్రాంతాల్లో చిరువ్యాపారులు ఉసూరుమన్నారు. పనులపై బయటకు వచ్చిన వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు.

నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన


కొత్త సాఫ్ట్‌వేర్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ నాగేశ్వరరావు


సీవీ నాగేశ్వరరావుకు జ్ఞాపిక అందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్: మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని గాయత్రి ఇంజినీరింగ్ కాలేజీ కెమికల్ ఇంజినీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సి.వి.నాగేశ్వరరావు సూచించారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్ విభాగం విద్యార్థులకు నూనత కంప్యూటర్ పరిజ్ఞానంపై సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో కొత్తగా ప్రవేశపెట్టిన సిమ్యులేషన్ సాఫ్ట్‌వేర్ వినియోగాన్ని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆచార్య నాగేశ్వరరావును సత్కరించి జ్ఞాపిక అందిచారు. కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, పీసీపీ విభాగం హెడ్ ప్రశాంతకుమారి, లెక్చరర్లు ఎస్ఎస్‌వీ కుమారి, బి.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోసం నిరసన

మహారాణిపేట: చదువుకున్న మహిళలకు ఉపాధి కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం దళిత మహిళా శక్తి సంఘం ఆధ్వర్యంలో పలువురు మహిళలు నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు జి.మరియమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి బాలయోగి, తదితరులు పాల్గొన్నారు.

జీవో నంబర్ 1 రద్దుకు డిమాండ్

జీవో నంబర్ 1ను తక్షణం రద్దు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ వై.రాంబాబు, నాయకులు ఎస్.నారాయణ, ఆర్.పవన్, యు.నాగరాజు, దేవ ప్రసాద్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల ఆందోళన

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ యునైటెడ్ గ్రామ పంచాయతీ శానిటరీ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ అనుబంధం) విశాఖ జిల్లా ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట గ్రామ పంచాయతీ స్వచ్ఛ భారత్, కాంట్రాక్టు కార్మికులు ఆందోళన చేశారు. పంచాయతీల్లో పారిశుధ్య పనులు చేస్తున్న స్వచ్ఛ భారత్ కార్మికుల వేతనాలు పెంచాలని కోరారు. ఆరు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ మల్లికార్జునకు అందజేశారు.

హమాలీల ధర్నా

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సివిల్ సప్లయీస్ హమాలీలు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏపీ స్టేట్ సివిల్ సప్లయీస్ హమీలీస్ యూనియన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో పీఎఫ్, పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. పలు సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. యూనియన్ నాయకులు ఎం.మన్మథరావు, పైల అప్పారావు, ఎం.వెంకటరమణ, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ప్రభుత్వ పథకాలు


డ్వాక్రా సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న జీవీఎంసీ పీడీ పాపినాయుడు

సీతంపేట: మహిళల సంక్షేమం, సాధికారతకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జీవీఎంసీ పీడీ పాపినాయుడు సూచించారు. జీవీఎంసీ 43వ వార్డు జగన్నాథపురంలోని సామాజిక భవనంలో జోన్–5 ఏపీడీ పద్మావతి ఆధ్వర్యంలో సోమవారం డ్వాక్రా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన డ్వాక్రా సంఘాల పనితీరు, బ్యాంకు లింకేజీలు, వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, మహిళా సంఘాల పనితీరు, పురోగతి వంటి అంశాలపై సమీక్షించారు. అనంతరం పీడీ మాట్లాడుతూ జీవీఎంసీ డ్వాక్రా సంఘాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల్లో కొన్నింటిని ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సీవోలు, ఆర్పీలు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'గ్రీవెన్స్'


వినతిపత్రం స్వీకరిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన పలు వార్డుల ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. వాటిని కె.కె.రాజు పరిశీలించి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరి కొన్ని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్ కుమార్‌రాజు, మాజీ కార్పొరేటర్ బాక్సర్ రాజు, పార్టీ పలు వార్డుల అధ్యక్షులు పాల్గొన్నారు.

విలక్షణ నటుడు శోభన్‌బాబు


శోభన్‌బాబు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

కంచరపాలెం: స్థానిక రామ్మూర్తిపంతుల పేట మహాత్మాగాంధీ గ్రంథాలయం వద్ద సిటీ వైడ్ శోభన్‌బాబు ఫ్యాన్స్ ఆధ్వర్యంలో సోమవారం 'నట భూషణ్ ' శోభన్‌బాబు 15వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. శోభన్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘసేవకు మారుపేరుగా నిలిచిన మహోన్నత వ్యక్తి శోభన్‌బాబు అని కొనియాడారు. చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు వెంకటరమణ, కె.వెంకటరావు, గువ్వల.రమణ, జి.నాగరాజు, సూర్యనారాయణ, కె.రాజు, సత్యనారాయణ,అప్పారావు, కె. శోభనబాబు, పి.దేవకి, కె.సూర్యరత్నం, పాల్గొన్నారు.

రోల్‌బాల్ క్రీడాకారులకు ఘన సత్కారం


వేద నరసింహను సత్కరిస్తున్న సనపల వరప్రసాద్


రోల్‌బాల్ క్రీడాకారులతో కోచ్ సంతోష్‌కుమార్

మురళీనగర్: మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్స్ పార్కులో విశాఖ రోల్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒకటో రోల్‌బాల్ వార్షికోత్సవంలో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న రోల్‌బాల్ క్రీడాకారులను సోమవారం ఘనంగా సత్కరించారు. పార్క్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ వారిని సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సీజన్‌లో రోల్‌బాల్ క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు తన సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు. స్టేట్ రోల్‌బాల్ టెక్నికల్ కమిటీ హెడ్ షేక్ అబ్దుల్ సలాం, ఉపాధ్యక్షుడు ప్రతాప్ ప్రసంగించారు. కోచ్ సంతోష్‌కుమార్ శిక్షణలో ఏడాది కాలంలో 40 మంది నేషనల్ లెవెల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు. విశాఖ రోల్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ తోట లలిత ప్రియ, కోచ్ పి.సంతోష్‌లను సత్కరించారు. కార్యక్రమంలో వైశాఖీ స్పోర్ట్స్ పార్క్ కార్యదర్శి పి.నాగరాజు, ఉపాధ్యక్షుడు శాంత భూషణం, మోహన్ పాల్గొన్నారు.

వరల్డ్ రికార్డు బాలుడికి సన్మానం

కార్యక్రమంలో భాగంగా పుత్తూరుకు చెందిన టాలెంట్ అకాడమీలో జి.ప్రతాప్ వద్ద శిక్షణ పొంది 270 కిలో మీటర్లు నాన్ స్టాప్ స్కేటింగ్ చేసి వరల్డ్ రికార్డు విజేతగా నిలిచిన వేద నరసింహ(8)ను విశాఖ రోల్‌బాల్ అసోసియేషన్ తరపున సన్మానించారు.

రేపటి నుంచి సీతారామ కల్యాణోత్సవాలు


సీతారామ కల్యాణ వసంత నవరాత్రి ఉత్సవాల కరపత్రం ఆవిష్కరిస్తున్న సంపంగి శ్రీనివాసరావు

సీతంపేట: వైఎస్సార్‌సీపీ నాయకుడు, సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు, మంగమ్మ దంపతుల ఆధ్వర్యంలో స్థానిక పార్వతీశ్వరాలయంలో ఈ నెల 22వ తేదీ ఉగాది రోజు నుంచి 30 వరకు సీతారామ కల్యాణ వసంత నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలను సోమవారం పార్వతీశ్వరాలయంలో శ్రీనివాసరావు ఆవిష్కరించి మాట్లాడారు. శ్రీరామనవమి సందర్భంగా 2018 నుంచి ప్రతి ఏటా కల్యాణ మహోత్సవాలు జరుపుతున్నామని, ఈ ఏడాది కూడా అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 22న పెండ్లి రాట, ఉత్సవ విగ్రహాలకు మంగళ స్నానం, కలశ స్థాపన చేస్తామన్నారు. ఈ నెల 30వ తేదీ శ్రీరామనవమి రోజున ఉదయం 9 గంటల నుంచి పార్వతీశ్వరాలయం వద్ద కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరుగుతుందని చెప్పారు. సాయంత్రం మేళతాళాలతో ఉత్సవమూర్తులను ఊరేగిస్తామని తెలిపారు. 31వ తేదీ ఉదయం 8 గంటలకు స్వామి వారికి పట్టాభిషేకం అత్యంత వైభవంగా జరిపిస్తామన్నారు. వసంత నవరాత్రులు తొమ్మిది రోజులు ఉదయం, సాయంత్రం ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అర్చనలు, పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్వతీశ్వరాలయ చైర్మన్ నమ్మి పద్మా వెంకట్, భీమవరపు శ్రీనివాసరావు, కేసుబోయిన శ్రీనివాసరావు, ఇప్పిలి అప్పలనాయుడు, పోతుబంతి హరికృష్ణ, జోరీగల గణేష్, ఆలయ అర్చకులు గంగవరపు శివాజీశర్మ, భాస్కరశర్మ పాల్గొన్నారు.

అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్


సీతమ్మధార రైతుబజార్ ప్రధాన గేటు వద్ద అడ్డంగా పార్క్‌చేసిన వాహనాలు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్ ప్రధాన గేటు వద్ద అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపి వదిలేస్తున్నారు. దీంతో వినియోగదారులు బజార్ లోనికి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. సోమవారం ప్రధాన గేటు వద్ద ద్విచక్ర వాహనాలతోపాటు ఆటోలను అడ్డంగా పార్క్‌చేయడంతో రైతుబజార్ లోపలకు దారి లేకుండా పోయింది. ఒక పక్క గేటుకు ఇరువైపులా దుకాణాల ఏర్పాటుతోపాటు వాహనాలు పార్కింగ్ చేయడంతో వినియోగాదారులు, మహిళలు, ఇబ్బందులకు గురయ్యారు. రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ పర్యవేక్షణ లేకపోవడంతోనే ప్రతి రోజూ ఇదే పరిస్థితి నెలకొంటోందని పలువురు వినియోగదారులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.